
# చేరువ




చిన్న సందులా, సన్నటి రేఖలా.... బెత్తెడు వెడల్పుబద్దలా కనబడింది ఆకాశం సత్యానికి, కిటికీ రెక్క నెమ్మదిగా తీస్తుంటే. ఆకాశం మీంచి చూపులు దింపి నెమ్మదిగా కిందకి చూశాడు.

పచ్చటి, ఎర్రటి బాదంచెట్టు ఆకులు, యింకా కింద గాజుపెంకులు పాతిన పాతగోడ.... గోడ అంచుల దగ్గర నాచు... రేకు తలుపు... నాలుగడుగుల చదరంలా వున్న ఆ చోటు అక్కడికి మేడమీంచి సఖమే కనిపిస్తోంది.

'రాలేదు... యింకా రాలేదు' అనుకున్నాడు.

కిటికీ పక్కగానే వుంది మంచం. మంచం మీద మోకాళ్ళపైన కూచున్నాడు సత్యం. అలా కూచుంటేనే కానీ కిటికీ పై రెక్కలదాకా మెడ చాపలేడు.

మెడ కొంచెం లాగుతుంటే దిగిపోదామా అనుకున్నాడు. కానీ మనసొప్పలేదు. ఓసారి మెడని అటూయిటూ తిప్పి సర్దుకుని మళ్ళీ చూశాడు. యిందాకా చూసినవన్నీ అలాగే వున్నాయి.

★ ★ ★

నిద్రలేచి అప్పటికే రెండు గంటలు దాటింది. ఆనాటి సూర్యుణ్ణి చూసి గంటపైనే అయింది. వంటావార్పు పూర్తిచేసి అరగంట అయింది. అయినా సరోజకి బద్ధకంగా వుంది. వొళ్ళూ మనసు చీదరగా చిరాకుగా వున్నాయి.

నులకమంచం పట్టీమీద కూచుని, కిటికీలోంచి మొండిగోడ మీద గాజుపెంకుల్లోని ఎండరంగుల్ని చూస్తూ, గ్లాసులో కాఫీని యాంత్రికంగా తాగుతోంది. కాఫీ తాగుతున్నాని తెలుస్తోంది తప్ప, తాగుతున్నట్టనిపించటంలేదు.

కాఫీ తాగటమే కాదు, చూట్టం.... మాట్లాట్టం.... వుద్యోగం చెయ్యటం... బయటికి వెళ్ళటం.... ఆ యింటికి రావటం యిలాంటి చాలాపనులు యీమధ్య యిలాగే వుంటున్నాయి.

కాఫీ తాగటం అయ్యాక లేచి మంచం పక్కనే వున్న గుమ్మందాకా నడిచి బైటికి తొంగి చూసింది. పొడుగ్గా చచ్చిపోయిన మట్టివొంటితోటి సందు ఎప్పటిలాగే వుంది. సందు చివరి పెరటి తలుపు వేసేసే వుంది.

ఆ తలుపు యింటివాళ్ళు తీస్తేనే కానీ దొడ్డివేపు వెళ్ళటానికి ఆస్కారం లేదు. కాస్సేపు అలా చూసి తిరిగి వెనక్కి మంచం దగ్గర కొచ్చింది సరోజ.

గది నాలుగువేపులా సామాను.... సామానుమధ్య చీకటి... దానిమీద అధికారం సంపాయించినట్టు ఆ నులకమంచం..... అన్నీ చూస్తుంటే ఆ గది చిన్న అడివిలా భయంకరమైన జంతువులు కనపడకుండా కాపలా కాస్తున్న యిరుకు జైలులా కనిపించింది.

ఈ గది గురించి, యీ ఇంటి తాలూకు యిబ్బందుల గురించి ఎన్నోసార్లు తల్లికి రాసింది. అన్నింటికీ యించు మించు తల్లి దగ్గర్నించి ఒకటే సమాధానం.

"వూరుకాని వూళ్ళో ఆడపిల్ల వొంటరిగా వుండాల్సి వచ్చినప్పుడు ఈ మాత్రం యిబ్బందులు తప్పవు. ఇలాంటి చిన్నచిన్న యిబ్బందులు సర్దుకుపోవాలి... అంతేకాని అయినవాళ్ళ నీడపట్టు వొదులుకోకూడదు" అని.

ఎన్ని రకాలుగా తన బాధ రాసినా యిదే సమాధానం. చివరికి విసుగెత్తి వోసారి ఘాటుగా రాసింది తల్లికి. 'ఆ యింట్లో వుండలేకపోతే వచ్చేయి.... కానీ వేరే గది చూసుకోవటం మాత్రం నాకిష్టం లేదు....' అంటూ నిష్టూరంగా సమాధానం రాసింది తల్లి.

ఆ యింటిని, చేస్తున్న ఉద్యోగాన్ని ఒదులుకుని వెళ్ళిపోవచ్చు. కానీ వెళ్ళాక అంతా మామూలే.... ఏ ఆదాయం లేని సంసారం..... తమ్ముడి చదువు ఆగిపోటం, మళ్ళీ అప్పులు.... తల్లి అందరిళ్ళల్లో చాకిరీ చేస్తాననటం.... ఏ దారీ తెన్నూ లేకుండా సంసారం తయారవటం.... అవన్నీ భరించలేకే యిక్కడ యిలా సర్దుకుపోయే ప్రయత్నం.

అన్నింటికీ అలవాటు పడింది. ఇంటివాళ్ళు యింట్లోంచి కాక సందులోంచే నడవమంటే.... 'అలాగే పిన్నీ...' అని వొప్పుకుంది. సందంతా రోజూ వూడ్చి ముగ్గెయ్యమంటే దానికీ సరే అంది. ఇంకా

యిలాంటి చాలా ఆంక్షలన్నీ వొప్పుకుంది. కారణం అల్లా ఒక్కటే. దూరపు బంధువులైనా వాళ్లింటో వుంటే వొంటరిగా వుంటున్న ఆడపిల్ల మీద అపవాదులు రావన్న సరోజ తల్లి చాదస్తం..... దాన్ని కాదనలేని బలహీనత.

అన్నింటికీ సర్దుకుంటూ వచ్చినా ఆ యిబ్బంది నెలా తప్పించుకోవాలో తోచలేదు సరోజకి. ఎన్ని రకాలుగా ఆలోచించినా పరిష్కారం తోచలేదు.

తనంతట తను 'పిన్నీ.... బాబాయి' అని యింటివాళ్ళని పూసుకు తిరిగినా, వాళ్ళు దూరంగానే చూస్తున్నారు. వాళ్ళు చెప్పినట్టు వింటం తప్ప మరో దారేం కనపట్టంలేదు.

"నేను పొద్దున్నే లేవలేను. నేను లేచిం తర్వాతే సందు తలుపు తీస్తాను. అంతే తప్ప చీకటితోటే నువ్వు లేచి తలుపు బాత్తే నా వల్ల కాదు" అని నిక్కచ్చిగా చెప్పేసింది యింటావిడ సరోజతోటి. "అది కాదు పిన్నీ...." అంటూ ఏదో చెప్పి బతిమాలబోయిన సరోజకి ఆ అవకాశం కూడా యివ్వలేదు.

సొంతింటితోపాటు ఏ వేళకి వెళ్ళినా ఫరవాలేని భర్త వ్యాపారం, పిల్లాజెల్లా లేకపోవటం, ఆవిడకి బాగా పొద్దెక్కే వరకు నిద్రపోవటం అలవాటు చేశాయి.

'స్నానం చేసి వంట చేసుకునే బదులు వంటా అది చేసుకుని స్నానం చేస్తే సరి....' అనుకుంది ముందు సరోజ. చాలారోజులు అలాగే చేసింది. కానీ సమస్య అంతటితో తీరలేదు.

చివరికి నీళ్ళంటేనే, స్నానం అంటేనే చిరాగ్గా తయారైంది. రెండుమూడు రోజులు స్నానం మానేసింది. ఓ రెండు రోజులు రాత్రిళ్ళు చేసి చూసింది..... రోజంతా వొళ్ళు అసహ్యంగా వుండి, మనసు కూడా చిరాగ్గా వుండేది.... ఏదో తప్పనిసరి బతుకు బతుకుతున్నట్టు తయారయింది పరిస్థితి.

ఎంతగా ఆలోచించినా ఏం చెయ్యాలో తోచలేదు సరోజకి. పైకి పెద్ద సమస్యలా కనిపించని ఈ ఇబ్బంది రోజురోజుకి చికాకు పెంచటం తప్ప, మనసుని హింసించటం తప్ప పరిష్కారం తోచలేదు.

బాగా ఎండెక్కాక.... దొడ్లో ఆ నాలుగడుగుల స్నానాల గదిలో బాదంచెట్టు కింద తప్పనిసరై స్నానం చేస్తుంటే..... మొండిగోడ మీది ఆ గాజు పెంకుల్లోంని వెలుగు.... తన వొళ్లంతా పాకి.... రక్కి, భయంకరంగా చీరుతున్నట్టనిపిస్తోంది. ఆ బాధ నుంచి తట్టుకోటానికి వొంటి నిండా చీర చుట్టుకున్నా, వొళ్ళు తడిశాక..... ఆ వెలుగు చీలుస్తున్నట్టే వుంది.... ఆ బాధకి వొళ్ళు, మనసు చచ్చిపోతున్నట్టే వుంది.

★ ★ ★

కిటికీ దాకా మెడ చాపి అలా చూస్తూ వుంటే కొత్తలో వొళ్ళంతా వొణికేది సత్యానికి. నిముషాల మీద శెగలొచ్చి శరీరం వేడెక్కేది. అలా వేడెక్కిన వొంటికి చెమటలు పట్టి మరింత ఆవిరొచ్చినట్టుండేది.

ముందు కొన్నాళ్ళు అలా చూట్టం తప్పని మనసు బాధపెట్టింది సత్యాన్ని. ఆడ అనుభవం లేని యిరవై ఎనిమిదేళ్ళ వయసు.... స్నేహితుల ద్వారా.... దొంగచాటు సినిమాలు, పుస్తకాల ద్వారా తెలిసిన కోరిక సత్యం మనసుని జయించాయి.

"ఎవరినీ కష్టపెట్టకుండా, నా అంతట నేను యీ మాత్రం ఆనందపట్టంలో తప్పేం లేదు...." అని చివరికి తన మనసుకి తనే నచ్చచెప్పుకున్నాడు.

ఓ చేత్తో పట్టుకున్న కిటికీ రెక్క నుదుటుకి గట్టిగా వొరుసుకుంటోంది. బాదంచెట్టు కింద గాజు పెంకుల గోడ కింద ఎప్పుడు తెరుచుకుంటుందా ఆ రేకు తలుపన్నట్టు అలాగే చూస్తూ కూచున్నాడు

సత్యం.

అలా చూట్టం సంతోషమూ కాదు.... పూర్తి తృప్తీ కాదు.... చిత్రమైన ఓ యిష్టం. 'నేను చేస్తున్న దేమిటి' అని చాలాసార్లు ఆలోచనొచ్చింది సత్యానికి. 'ఆఫ్టాల్ కొంచంసేపు.... కొంతవరకు ఆడశరీరాన్ని నగ్నంగా చూట్టం..... యింతేనా.... యిలా కక్కుర్తి పట్టం ఎందుకు?.... సరైన వుద్యోగం, జీవితం లేనందుకేనా..... ఎవర్తోటి జీవితం యింతవరకు పంచుకోలేకపోయినందుకేనా.... పోనీ కాస్సేపు ఏదో వొంటిని ఎక్కడో అక్కడ కొనుక్కోవచ్చు....' ఆవేశం తగ్గాక తిరిగి భయం వేసేది సత్యానికి. 'అలా కొనుక్కున్న అనుభవం, చెడిపోయిన ఆ ఆడాళ్ళ అనారోగ్యం, వాళ్ళ రోగాలు తన కొచ్చేస్తే....' తిరిగి పిరికితనం.

తృప్తో, అసంతృప్తో తెలుసుకోలేని అనుభవం, మెడ అంత ఎత్తుకి చాచి.... కిటికీకి అంత ఎత్తు ఎదిగి చూస్తున్నా తనలోకి తను కుంచించుకు పోతున్నట్టే వుండేది. అలా చూస్తున్నంతసేపూ పిరికిగా, దరిద్రంగానే వుండేది సత్యానికి. అయినా రోజూ పొద్దున్నే కొన్ని గంటలు శ్రమపడి కొన్ని క్షణాలు అలా చూస్తూనే వున్నాడు. తనని తను చంపుకుంటూనే వున్నాడు.

పక్క దొడ్డి స్నానాల గది రేకు తలుపు సత్యం చూపుని కొంచం వెనక్కి తోసింది. వులిక్కిపడి కిటికీ సందులోకి జరిగిపోయి సర్దుక్కూచున్నాడు.

రేకు తలుపు దాటుకుని లోపలికొచ్చింది సరోజ. చేతిలో చీరని, తువ్వాల్ని మొండిగోడ మీద వేసింది. చేతిలో మిగిలిన వాటిని వొంగుని కింద పెట్టింది. పైకి లేచిన సరోజ కిటికీ వేపు పరీక్షగా చూస్తున్నట్టనిపిస్తే కిటికీ తలుపు కాస్త ఖాళీనీ మూసేశాడు సత్యం. మరో నిముషం ఆగి తిరిగి కొద్దిగా తీశాడు.

పచ్చగా వడ్డాణంలా నడుం కనిపిస్తోంది సత్యానికి. ఆ పచ్చదనం వొణికినట్టనిపిస్తే వోసారి గట్టిగా కళ్ళు మూసుకుని, తెరిచి చూపుకి పదునుపెట్టాడు సత్యం. సరోజ జాకెట్టు తీసేసింది..... బ్రా తీసేసింది..... అంతవరకు అటువేపు వున్నదల్లా యిటు తిరిగింది.

సత్యం చూపులు కంగారుపడ్డాయి. వొక్క క్షణం భగ్గుమన్న వొళ్ళు వేడెక్కి వొణుకు తగ్గింది.

"ఎంత స్వచ్ఛంగా, నిర్మలంగా వుంది యీ అందం" అనుకున్నాడు.... అనుకుంటూ.... 'అదేమిటి' ....' అనుకున్నాడు సత్యం.

సరోజ సూటిగా కిటికీవేపు చూస్తోంది. అంతదూరంలో వున్నా సరోజ కళ్లు స్పష్టంగా కనిపించాయి సత్యానికి. ఒక్క నిముషం అదిరిన సరోజ బుగ్గలు.... కదలిన సరోజ పెదాలు.... కనీ కనిపించని సన్నటి కన్నీటి తెర కనిపించాయి. వీటన్నిటికన్నా స్పష్టంగా సరోజ రెండు చేతులుగుండెల కడ్డుగా పెట్టుకుని పెట్టిన దణ్ణం కనపడింది.... అర్థింపు కనపడింది.

కిటికీ మూసేస్తూ కిందకి జారిపోయాడు సత్యం. చాలాసేపు సిగ్గేసింది.... తర్వాత అసహ్యం వేసింది. సాయంత్రానికల్లా వేసేసిన కిటికీ తలుపుకి అడ్డంగా పెద్ద చెక్కపెట్టి, అది రాకుండా మేకులు దిగ్గొట్టాడు.

★ ★ ★

తన బలహీనతని మేకులతో అణగ్గొట్టిన మూడోనాడు సత్యానికి సరోజ రోడ్డు మీద ఎదురు పడింది.

నాలుగురోజుల క్రితం వరకు ఎదురుపడితే శత్రువుల్లా చూసుకునే వాళ్ళిద్దరూ ఓ క్షణం వొకరివేపు మరొకళ్లు చూసుకున్నారు.

ముందు సరోజే నెమ్మదిగా, పలకరింపుగా నవ్వింది.

నోరు విప్పి మాట్లాడకపోయినా, ఏం చెప్పకపోయినా ఆ నవ్వుతో సరోజ ఎన్నో విషయాలు చెప్పినట్టనిపించింది సత్యానికి. యిద్దరు మనుష్యుల మధ్య వుండాల్సిన చేరువ వున్నట్టు తోచింది.

అంతవరకూ తనని దిగలాగుతున్నట్టున్న పెద్ద బరువు తొలిగిపోయినట్టనిపించింది సత్యానికి. సరోజ వేపు చూస్తూ నెమ్మదిగా పలకరింపుగా, స్నేహంగా తనూ నవ్వాడు.

• *జ్యోతి మాసపత్రిక, మార్చి - 1978 (కథల పోటీలో బహుమతి)*